# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 17-04-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- లోక్‌సభలో ఈరోజు జరిగిన ఓటింగ్‌లో రాజ్యాంగ 131వ సవరణ బిల్లు- 2026 వీగిపోయింది.
- రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా హరివంశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
- రైతుల ప్రయోజనాలే సర్వోన్నతమైనవని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు.
- దేశవ్యాప్తంగా ఎల్‌పిజి సరఫరా స్థిరంగా కొనసాగుతోందని కేంద్ర ప్రభుత్వం తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = =

రాజ్యాంగ 131వ సవరణ బిల్లు- 2026పై కొద్దిసేపటి క్రితం లోక్‌సభలో ఓటింగ్ జరిగింది. ఈ ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు రాగా 230 మంది సభ్యులు వ్యతిరేకంగా ఓటువేశారు. ఈరోజు లోక్‌సభలో 528 మంది సభ్యులు ఓటు వేశారు. ఈ బిల్లుకు మూడింట రెండు వంతుల ఆధిక్యం కోసం 352 ఓట్లు రావలసి ఉండగా 298 ఓట్లు మాత్రమే రావడంతో బిల్లు వీగిపోయిందని స్పీకర్ ఓంబిర్లా ప్రకటించారు. రాజ్యాంగ 131వ సవరణ బిల్లు- 2026 వీగిపోవడంతో.. పునర్విభజన బిల్లు- 2026, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లు- 2026 లను ఉపసంహరించుకుంటున్నట్టు పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజిజు లోక్ సభలో ప్రకటించారు.

= = = = = = = = = = = = = = = = = = =

రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా హరివంశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజ్యసభ సభా నాయకుడు జె.పి. నడ్డా, హరివంశ్‌ను రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నుకోవాలని తీర్మానాన్ని ప్రవేశపెట్టగా వరుసగా మూడవసారి ఆయన డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ హరివంశ్‌కు అభినందనలు తెలిపారు. డిప్యూటీ ఛైర్మన్‌గా ఆయన భవిష్యత్ పదవీకాలం అంకితభావంతో కొనసాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా దేశీయ ఎల్‌పిజి సరఫరా స్థిరంగా కొనసాగుతోందని పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి సుజాత శర్మ స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన అంతర్-మంత్రిత్వ శాఖల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా పంపిణీ కేంద్రాలలో ఎక్కడా సరఫరా నిలిచిపోయిన సమాచారం లేదని, ఎల్‌పిజి సరఫరా సాధారణంగానే కొనసాగుతోందని చెప్పారు. ప్రస్తుతం దాదాపు 98 శాతం ఎల్‌పిజి బుకింగ్‌లు ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయని, డెలివరీ అథెంటికేషన్ కోడ్ విధానం ద్వారా 93 శాతం డెలివరీలు ధృవీకరించబడుతున్నాయని సుజాత శర్మ పేర్కొంటూ...

(వాయిస్...26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఉద్ఘాటించారు. మధ్యప్రదేశ్ రైతులతో న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. రైతుల ప్రయోజనాలే సర్వోన్నతమైనవని అన్నారు. కాకర సాగులో నాసిరకం విత్తనాలు, నారుమొక్కల వల్ల తాము భారీ నష్టాలను చవిచూశామని రైతులు, మంత్రికి వివరించగా.. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన కేంద్రమంత్రి.. ఇది రైతుల జీవనోపాధిపై జరిగిన ప్రత్యక్ష దాడిగా అభివర్ణించారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చూడాలని, దీనికి కారణమైన కంపెనీపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = =

విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్ న్యూఢిల్లీలో ఉక్రెయిన్ జాతీయ భద్రతా, రక్షణ మండలి కార్యదర్శి రుస్తెం ఉమెరోవ్‌ను ఈరోజు కలిశారు. ఈ సమావేశంలో ఇరు దేశాధినేతలు భారత్, ఉక్రెయిన్‌ల మధ్య ద్వైపాక్షిక సహకారంపై చర్చించారని డాక్టర్ జైశంకర్ ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపారు. ఉక్రెయిన్ వివాదంపై కూడా ఇరు దేశాధినేతలు తమ అభిప్రాయాలను పంచుకున్నారని ఆయన తెలిపారు. మరోపక్క.. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కూడా ఈరోజు రుస్తెం ఉమెరోవ్‌తో సమావేశమయ్యారు. ఇరువురు ద్వైపాక్షిక సంబంధాలను సమీక్షించుకున్నారని, రష్యా-ఉక్రెయిన్ వివాదంపై చర్చించారని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ ఆసియాలో సంఘర్షణ ప్రారంభమైనప్పటి నుండి ఇరాన్ నుండి 2 వేల 361 మంది భారత పౌరులను సురక్షితంగా భారత్‌కు తీసుకురావడం జరిగిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వీరిలో 2 వేల 60 మంది అర్మేనియా మీదుగాను, 301 మంది అజర్‌బైజాన్ మీదుగా వచ్చారని చెప్పారు. ఇజ్రాయెల్, లెబనాన్‌ల మధ్య కాల్పుల విరమణ అంశంపై ఆయన మాట్లాడుతూ, భారత్ ఈ కాల్పుల విరమణను స్వాగతిస్తుందని, శాంతికి దారితీసే ప్రతి అడుగును భారత్ స్వాగతిస్తుందని తెలియజేస్తూ...

(వాయిస్…32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

నియోజకవర్గాల పునర్విభజన వల్ల ప్రతి నియోజకవర్గంలో ఓటర్ల హేతుబద్ధీకరణ జరుగుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. లోక్‌సభలో రాజ్యాంగ 131వ సవరణ బిల్లు- 2026, పునర్విభజన బిల్లు- 2026, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల సవరణ  బిల్లు- 2026లపై ఈరోజు జరిగిన చర్చకు ఆయన సమాధానమిచ్చారు. పునర్విభజన ప్రక్రియతో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు కేటాయించే సీట్ల సంఖ్య పెరుగుతుందని, పునర్విభజన ప్రక్రియను వ్యతిరేకించడం ఎస్సీ, ఎస్టీలకు సీట్ల సంఖ్య పెరగడాన్ని వ్యతిరేకించడమే అని అన్నారు. 2029 లోక్‌సభ ఎన్నికలు మహిళా రిజర్వేషన్‌తో జరిగేలా చూడటమే ఈ బిల్లుల లక్ష్యమని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

పూర్వ ప్రధానమంత్రి చంద్రశేఖర్ ఒక దార్శనిక నాయకుడని, ప్రజాస్వామ్య విలువలకు స్థిరమైన యోధుడని ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ వ్యాఖ్యానించారు. చంద్రశేఖర్ శత జయంతి సంవత్సరం ప్రారంభాన్ని జరుపుకుంటున్న ఈ తరుణంలో, ఆయన ఇష్టపడిన ధైర్యం, నిరాడంబరత వంటివి నిలబెట్టేలా సంకల్పం చేయడానికి ఇది మంచి అవకాశమన్నారు. ఆయన ప్రజా జీవితంలో నిజాయితీగా ఉంటూనే.. సామాజిక న్యాయం, జాతీయ ఐక్యత, ఆదర్శాలకు కట్టుబడి ఉన్నారని ఉప రాష్ట్రపతి  పేర్కొన్నారు. కాగా.. ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ఈ నెల 19వ తేదీ నుంచి రెండు రోజుల పాటు శ్రీలంకలో పర్యటించనున్నారు. ఉపరాష్ట్రపతికి ఇది శ్రీలంకలో తొలి ద్వైపాక్షిక పర్యటన. భారత్, శ్రీలంక దేశాల ప్రజల మధ్య వేల సంవత్సరాల నాటి సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా ఈ పర్యటన జరగనుంది.

= = = = = = = = = = = = = = = = = = =

సుగంధ ద్రవ్యాల రంగ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు నాణ్యత, ఆవిష్కరణలతో పాటు పరిశ్రమ-ప్రభుత్వం మధ్య బలమైన సహకారం అవసరమని కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖా మంత్రి చిరాగ్ పాశ్వాన్ ఉద్ఘాటించారు. న్యూఢిల్లీలోని పిహెచ్‌డి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఈరోజు నిర్వహించిన భారత్ స్పైస్ కాన్‌క్లేవ్-2026లో ఆయన మాట్లాడుతూ.. సుగంధ ద్రవ్యాలను కేవలం వంటగది నిత్యావసరాలుగా పరిగణించడం సరికాదని, న్యూట్రాస్యూటికల్స్, ఫుడ్ సప్లిమెంట్స్, ప్రపంచ వాణిజ్యం వంటి రంగాలలో వాటి సామర్థ్యాన్ని అన్వేషించాలని సూచించారు. భారతదేశ చారిత్రక వాణిజ్య మూలాలు సుగంధ ద్రవ్యాలతో బలంగా ముడిపడి ఉన్నాయని, శతాబ్దాల క్రితం, భారత్‌తో జరిగే ప్రపంచ వాణిజ్యం ప్రధానంగా సుగంధ ద్రవ్యాలు కేంద్రంగా జరిగేదని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

గుజరాత్ లోని అహ్మదాబాద్ స్టేడియం వేదికగా.. కోల్‌కతా నైట్ రైడర్స్, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన కోల్‌కతా జట్టు 10 ఓవర్లు పూర్తయ్యేసరికి 3 వికెట్లు కోల్పోయి 80 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 133వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈనెల 24వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =